# దొర

తెల్లవారుతే వస్తానన్నాడు అతడు.

కాని ఇంకా తెల్లవారలేదు.

ఊరు ఇంకా చీకటిలోనే ఉంది. వెలుతురు తగ్గిందని సాయంత్రం కొత్త వెలుతురు వెతుకుతూ వెళ్ళి, పశ్చిమాన మాయమైన లోకబాంధవుడు, వెలుతురుతో వచ్చే సూచనలు కనబడుతున్నాయి. మిడిమిడి జ్ఞానం లాంటి పొగమంచు ఊరంతా నిండి వుంది.

పొరపాటు చేసానని అనిపించింది నాకు. ట్రైను దిగిన వెంటనే హోటలుకు వెళ్లి తెల్లవారిన తరువాత ఇక్కడికి వస్తే బాగుండేది. కాని చేతిలో ఏదైనా పనివుంటే నాకు ఆ పని తప్ప వేరేదీ కనబడదు. అందువల్ల అప్పుడప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటూ వుంటాను కూడా. అయినా చెయ్యవలసిన పని మీద ధ్యాస ఉంచడం, అనుకున్న పని అనుకున్న విధంగా, అనుకున్న సమయంలో పూర్తి చెయ్యడం అలవాటై పోయింది. సరైన సమయంలో పూర్తి చెయ్యకపోతే, చేసిన పని వృధా అని చెప్పేవాడు మా దొర!

దొర గుర్తుకు రాగానే, నా కళ్ళు చెమర్చాయి.

సంక్రాంతి ముందు రోజులు కనుక, వాతావరణం చల్లగా ఉంది. గోదావరిలో మునిగి వచ్చిన గాలి చల్లగా నన్ను తాకింది.

గోదావరి గట్టుమీద వుండే మర్రిచెట్టు కింద కూర్చున్నాను. 'మఫ్లరు' తల మీదుగా కట్టుకుని 'షాలు' కప్పుకున్నాను. చేతిలోని పాకెట్టుని ఆప్యాయంగా తడిమి ఒడిలో పెట్టుకుని అటూ ఇటూ చూసాను.

శవమెళ్ళిన ఇల్లులా నిశ్శబ్దంగా ఉంది ఊరు. అక్కడక్కడ గుడ్డి దీపాల వెలుగు కనబడింది. కరెంటు దీపాల వెలుగు లేదెందుకో... గాలికి ఊగే చెట్లు దెయ్యాల్లా కనబడ్డాయి.

ఊరవతల ఎక్కడో దూరంగా ఉంది వెలుగు, వెన్నెల లాంటి విద్యుత్తు కాంతిలో తడిసిన ఇళ్లు – ఇళ్లకి అవతల పొగ గొట్టాలు – కర్మాగారం.

నా గుండె గబగబ కొట్టుకుంది. సంవత్సరాలు తరబడి నేను పనిచేసిన కర్మాగారం అది. పుట్టినిల్లు కనబడిన ఆడపిల్ల గుండెలా తల్లడిల్లింది నా హృదయం.

పొద్దునే రావాలని ముందు అనుకున్నాను. ఒకసారి కర్మాగారానికి వెళ్ళి, అక్కడంతా తిరిగి, పాత మిత్రులతో కబుర్లాడి దొర గురించి చెప్పాలని అనుకున్నాను. ఫోను చేస్తే, జి.ఎం.గారు పెద్దగా స్పందించలేదు. అంతేకాదు, బయలుదేరే ముందు కనబడిన రామ్మూర్తి మాటలు కూడా నన్ను నిరుత్సాహపరిచాయి.

రామ్మూర్తి మా ఊరివాడే. 'మా కర్మాగారంలోనే పనిచేసాడు. మొన్న మొన్ననే పదవీ విరమణ చేసి మా ఊరు వచ్చాడు.

"ఫాక్టరీకి వెళ్తారా... ఒద్దు గురూ..." రామ్మూర్తి అన్నాడు.

"యాజమాన్యం, ఇప్పుడు, పూర్వంలా లేదు గురూ..."

"అంటే...?"

"మనమేమో మన వాళ్ళని, మనం నడిపిన యంత్రాలని చూడాలని ఆశగా వెళ్తామా... యాజమాన్యం వారు మనని లోపలికి రానివ్వరు. ఫాక్టరీ గేటు నుంచే వెనక్కు పంపుతున్నారు".

"అదేంటీ...?"

"అదంతే. పూర్వం ఉన్న ఆప్యాయతలు, మనమంతా ఒకటే అనే ఆలోచనలు ఇప్పుడు లేవు. దొర వెళ్ళాక మెల్లమెల్లగా వచ్చిన మార్పులు మీరు గమనించే వుంటారు. ఇప్పుడు ఉద్యోగులకు సర్వీసులో వున్నప్పుడే విలువ ఇవ్వడం లేదు. ఇంకా రిటైరైనాకనా... ఆరోజుల్లో ఎలా ఉండేది. దొర ఉన్నప్పుడు అంతా ఒక కుటుంబంలా ఉండేవాళ్ళం కదూ... కాని ఇప్పుడు... ఉద్యోగులు కూడా ఏమైనా తక్కువ తిన్నారా...? ఒకరి మీద ఒకరు చాడీలు చెప్పుకోవడాలు... కుట్ర పన్నడాలు... ఒకటా రెండా యాజమాన్యం వారి మెప్పు పొందడం కోసం సహోద్యోగుల కొంపలు ముంచడానికి కూడా సందేహించడం లేదు. అయన ఉన్నప్పుడే షోకు చేసుకోనిది ఇక ముండమోసాక ఏం చేస్తుంది అన్నట్టు, ఉద్యోగంలో ఉన్నప్పుడే లేనిది రిటైరైనాకా ఉంటుందా? అనుబంధాలు కనుమరుగయ్యే రోజులు కావా, ఇవి!" నేను మాట్లాడలేదు.

"ప్రైవేటు రంగ సంస్థలో పని చెయ్యడం మన దురదృష్టం గురూ... ఇరవై ముప్ఫై సంవత్సరాలు ఫాక్టరీని నమ్ముకొని జీవితం ధారపోసిన వాడికి పదవీ విరమణ తరువాత ఎలాగూ జీవిత భద్రత కల్పించటం లేదు. కాని కనీసం ఫాక్టరీకి వెళ్తే ఆప్యాయంగా

పలకరించడం కూడా లేదు" గట్టిగా నిట్టూర్చాడు రామ్మూర్తి.

"రోజు వారి కూలీలకు కూడా పని చెయ్యలేని పెద్ద వయసులో జీవిత భద్రత కల్పించే ప్రభుత్వం, ప్రైవేటురంగ సంస్థల్లోని కార్మికుల గురించి ఎందుకు పట్టించు కోదో...?" తన బాధ మొత్తం ఒలకపోసాడు రామ్మూర్తి. "దొరే వుండి-వుంటే ఇలా ఉండేది కాదు"

నిజమే! దొర మా ఫాక్టరీ జి.ఎం.గా ఉండి వుంటే ఇలా జరిగేది కాదు, అతడు వేసిన ప్రతి అడుగులోనూ మానవత్వం తొణికిసలాడేది, ప్రతిమాటలోనూ మానవ స్పర్శ ఉండేది.

పాతికేళ్ళ క్రితం - బాగా గుర్తుంది. అప్పుడు రామ్మూర్తికి ముప్పైయేండ్ల పైనే...

చీకటి పడినా, ఆకాశాన నక్షత్ర దీపాలు వెలగలేదు, కరెంటు పోయినట్టుంది.

దొర ఇంకా ఆఫీసులోనే ఉన్నాడు. అతడు ఉన్నాడు. కనుక నేనూ ఉన్నాను.

హఠాత్తుగా ఫాక్టరీ అంధకారంలో మునిగింది. ఫాక్టరీలో కరెంటు పోయింది. ఫాక్టరీలో వుండే విద్యుత్తు ఉత్పత్తి కూడా ఆగిపోయింది. ఒకటే హడావిడి - పరుగులు - ఏం జరిగిందని తెలియక తలబాదుకొని తిరుగుతున్న రామ్మూర్తికి ఇంటి నుంచి ఫోను వచ్చింది. ఫోను మాట్లాడిన రామ్మూర్తి కరెంటు షాకు తగిలినట్టు నిలబడ్డాడు.

"ఏమైంది రామ్మూర్తి? వాట్ హాప్పెండ్" దగ్గరలోనే వున్న దొర అడిగాడు.

రామ్మూర్తి గొంతు విచ్చుకోలేదు. పని చేస్తూనే వున్నాడు.

"ఏమిటి రామ్మూర్తి...?" రామ్మూర్తి భుజం మీద చెయ్యివేసి ఆప్యాయంగా అడిగాడు దొర.

"ఏమిటి సమస్య?"

"మా ఆవిడని హాస్పిటల్‌లో చేర్చారట... ఎబార్షన్..."

"ఎందుకలా కంగారు పడతావు...? హాస్పిటల్‌కు వెళ్ళు"

"సర్, కరెంటు... సమస్య ఏమిటని తెలియడం లేదు. ఇప్పటికే గంట గడిచింది. గంట ఉత్పత్తి పోయింది. మనకి నష్టం..."

"ఇంకో రోజు ఎక్కువ ఉత్పత్తి చేస్తాం, మై బాయ్. ఫాక్టరీ లాభనష్టాలు గురించి ఆలోచిస్తున్నావు. వెరీగుడ్... అలాగే ఉండాలి. దానితో పాటు జీవితంలో కూడా లాభనష్టాల గురించి ఆలోచించాలి. "ఆఫ్టర్ ఆల్" కర్మాగారం మన గురించి, మన జీవితాలని మెరుగు పరచడం గురించి కదా... లాభాలు ఆర్జించడం కోసమే కాదు. నీ 'జూనియర్' ఉన్నాడుగా, చూస్తాడు. పైగా నేనూ ఉంటానులే. నేను చదివినది కూడా ఇదేకదా..."

రామ్మూర్తి కదిలాడు.

"ఆగు..." దొర పిలిచాడు. "నా కారు తీసుకొని వెళ్ళు..."

అది అలనాటి సంస్కృతి! కాని ఇప్పుడు రిటైరైతే గెలకొట్టిన అరటి చెట్టులా విసిరిపారేస్తున్నారు. అందువల్లే కదా, దొర సంగతి ఫోను చేసినా, ఎవ్వరూ స్పందించలేదు. ఎం.డి.గారు కూడా నా మాటల్లో ఆసక్తి చూపలేదు.

అవును! ఇప్పుడు ఉద్యోగం ఒక ఒప్పందం! పని గంటల గురించి జీతభత్యాల గురించి ఏర్పరచుకున్న లిఖిత పూర్వక ఒప్పందం! కాగితాలు స్పందించవు కదా!

గట్టిగా నిట్టూర్చాను.

పాతికేళ్ళ క్రితం ఉద్యోగ ఒప్పందం కాగితాలకే పరిమితంగా ఉండేది కాదు. ఫాక్టరీ పనులు, ఇంటిపనుల కన్నా పదిలంగా భావించేవారు ఉద్యోగులు. అంకిత భావంతో పని చేసే వారు. దొర కూడా ఉద్యోగులను సొంత బిడ్డల కన్నా ఎక్కువ ఆప్యాయంగా చూసుకునేవాడు.

పాపం! ఏ లోకంలో ఉన్నాడో... ఒడిలో వున్న దొర అస్తికలని ఆప్యాయంగా తడిమాను.

అందరూ అతన్ని దొర అని పిలిచే వారు. ఒంటికి గోధుమరంగు, జుట్టుకు లేత మందార రంగు, నీలి కనుపాపలు ఉండటం వల్లే అలా పిలిచేవారేమో... అతని పేరు కొందరికి తెలుసు కాని ఏ ఊరివాడనేది ఎవ్వరికీ తెలియదు. చాలా సంవత్సరాలుగా భారతదేశంలోని వివిధ ప్రాంతాలల్లో పని చెయ్యడం వల్ల అతడు హిందీ బాగా మాట్లాడేవాడు. భారతీయ ఆచార సాంప్రదాయాలు ఒంటపట్టించుకున్నాడు. శాకాహారమే మంచిదని అనేవాడు. ఊరు గురించి అడిగే వారందరికి అతడు ఒకటే చెప్పేవాడు.

"ఏ ఊరైతే నేంటీ..? నా ఊరు తెలుస్తే మీరు ఏమైనా ఇంతకన్నా మిన్నగా పని చేస్తారా? ఏ ఊరివాడైతేనేమి, నేనూ మనిషినే. అనుమానం లేదు. మీలాంటి మనిషిని, నాతోపాటు మీరందరూ సుఖంగా ఉండాలని అనుకుంటున్నవాడ్ని. మీతో కలిసి బ్రతికి ఈ మట్టిలోనే కలవాలని అనుకుంటున్న వాడ్ని"

ఆ మాటల్లో చాలా నిజాయితీ ఉండేది. ఎక్కడ ఏ ప్రాంతంలో పనిచేసినా, తరతమ భేదాలు లేకుండా కలిసిపోయే వాడు. ఆ సమాజంలో ఇమిడిపోయి, ఆ సమాజపు భాష, ఆచార సాంప్రదాయాలు నేర్చుకొని పాటించేవాడు.

హఠాత్తుగా గొంతు మండుతున్నట్టు తోచింది. దగ్గు ఆపుకోలేకపోయాను. తలయెత్తి చూసాను.

మా కర్మాగారంలోని పొగ గొట్టం నుంచి చిక్కని పొగ బయటకు వస్తోంది.

మా దొర ఉండే రోజుల్లో పొగ గొట్టం నుంచి చిక్కని పొగ రావటం ఎన్నడూ

చూడలేదు. అలా పొగ వస్తే ఊరుకునేవాడు కాదు దొర.

కర్మాగారాలు సామాజిక శ్రేయస్సుకని నమ్మినవాడు అతడు. "నేను మీ ఊరు వెళ్తున్నాను, మిస్టర్ రావ్" ముంబైలో పని చేస్తున్నప్పుడు ఒకరోజు దొర అన్నాడు. "మీరు నాతో వస్తారా?"

ప్రశ్నార్థకంగా చూసాను.

"అదే... ఆంధ్రా వెళ్తున్నాను. అక్కడ కొత్త కర్మాగారం కట్టాలట. మీరు వస్తే..."

ఇక ఆలోచించేదేముంది! వెంటనే సరేనని అన్నాను. "మీరు వస్తారని నాకు తెలుసు. కాని బాగా ఆలోచించుకోండి" దొర హెచ్చరించాడు. అక్కడ జీవితం ఇక్కడలా సుఖంగా ఉండదు. ఇక్కడలా "కార్లు, ఏసీలు. థియేటర్లు ఏమీ ఉండవు. పక్కాపల్లె అట"

నేను మాట్లాడలేదు.

"అక్కడ మనం ఒక ఫాక్టరీ కడుతున్నామంటే, ఒక కొత్త సమాజాన్నీ సంస్కృతిని తయారు చేస్తున్నామన్నమాట" దొర మళ్ళీ అన్నాడు.

ఆనందంగానే వచ్చాను. కాని ఊరులోకి వచ్చిపడ్డాక పొరపాటు చేసానేమోనని అనిపించింది. ఫాక్టరీకి కేటాయించబడిన భూమి నుంచి ముప్పై కిలోమీటర్లు వెళ్తేగాని, ఒక మోస్తరు పల్లెటూరైనా లేదు.

సుమారు వెయ్యి ఎకరాలు కేటాయించారు, ఫాక్టరీ కోసం. ఉత్తర భాగాన పెద్ద కొండ ఉంది. కేటాయించబడిన భూమిలో చిన్న చిన్న పల్లెలు ఉండేవి. అక్కడ గోచి కట్టుకొని తిరిగే మనుషులు - అసలు నాగరికత తొంగిచూడని ప్రదేశం అయినా దొర ఆ మనుషులతో ఏవేవో మాట్లాడేవాడు. వారి నమ్మకాలు సంప్రదాయాలు అడిగి తెలుసుకునే వాడు. నేను అతనికి దుబాసీగా వ్యవహరించేవాడ్ని.

నాకు చాలా నిరుత్సాహం అనిపించింది. అది గమనించిన దొర అన్నాడు. "ఒక పదేళ్ల తరువాత ఈ ప్రాంతం ఎలా మారుతుందో చూడండి. ఫాక్టరీ కట్టడం అంటే కొన్ని యంత్రాలని తీసుకొచ్చి పేర్చి ఉత్పత్తి సాధించడం కాదు. చుట్టూ వుండే వనరులతో పాటు, మానవ వనరులని సమాజాన్ని సంస్కరించి, కొత్త సమాజాన్ని సంస్కృతిని నెలకొల్పడం కూడా..." ఆవేశంతో ఇంకా ఏవేవో చెప్పాడు దొర.

జన సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రాముఖ్యం ఇచ్చేవాడు దొర. పాత సంస్కృతి పునాదిపైనే నవ సమాజం సృష్టించాలని తరచూ చెప్పేవాడు. ఫాక్టరీ కోసం కేటాయించిన భూమిలో ఒక చోట ఊరివాళ్ళ సంత ఉండేది. ఆ చోటు అలాగే ఉంచి ఉద్యోగుల కాలనీకి వచ్చే విధంగా శ్రద్ధ తీసుకున్నాడు. ఫాక్టరీ కట్టడం పూర్తి అయిన తరువాత కూడా బహుశా ఇప్పటికీ అక్కడే సంత జరుగుతోంది. తన వల్ల మరొకరు బాధపడ

కూడదని తరచూ చెబుతూ వుండేవాడు.

ఫాక్టరీ కట్టడం పూర్తి అయింది. ఉత్పత్తి మొదలైంది. స్థానికులతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన వారు ఫాక్టరీలో పనిచేసేవారు. ఎన్నో భాషలు మాట్లాడేవాళ్లు, ఎన్నో సంప్రదాయాల సాంస్కృతిక నేపథ్యం గల వాళ్ళు పనిచేసేవారు. అందరితోనూ ఒకేలా సన్నిహితంగా మసిలే వాడు దొర. వివిధ మతాల వారికి కాలనీలో వేరువేరు ప్రార్థనా మందిరాలు కట్టించాడు. చుట్టుపక్కల వుండే ఊళ్ల వారికి విద్యా ఆరోగ్య సదుపాయాలు కల్పించాడు.

ఊరంతా దొరే కనబడేవాడు. దేవీ నవరాత్రులప్పుడు దేవిచౌకులో అమ్మవారి దర్శనం చేస్తూ కనబడ్డాడట! మరోసారి భద్రాచలం వెళ్ళే పడవలో కనబడ్డాడట! మొహరం ఊరేగింపులో కూడా ముందు వరసలో కనబడేవాడు.

ఖాళీ దొరికినప్పుడల్లా గోదావరి గట్టుమీద కూర్చుని నదిలోని పడవలను చూస్తూ చాలాసేపు గడిపేవాడు. అతని 'గోదావరి పిచ్చి' గురించి కార్మికులు కథలు కథలుగా చెప్పుకునే వారు. ఆ కథలు విని ఉండబట్టలేక ఆ విషయం గురించి అడిగాను.

"నాకెందుకో గోదావరి అంటే ఇష్టం" దొర అన్నాడు.

"అన్నిటినీ అందరినీ తనలో విలీనం చేసుకునే గోదావరి అంటే ప్రేమ, అభిమానం".

నెరిసిన పగళ్ళు కనుమరుగైనాయి. నూనూగు మీసాల ఉదయాలు ఫాక్టరీలో దర్శనమిచ్చాయి.

కర్మాగారంలో నిర్విరామంగా తిరిగి తిరిగి అరిగిపోయిన యంత్రాలకు బదులుగా కొత్త యంత్రాలు వచ్చాయి. హఠాత్తుగా వచ్చింది ఆ వార్త – దొర వెళ్ళిపోతున్నాడట! ఆఫ్రికాలో ఏదో కర్మాగారం కట్టాలట.

"ఇది నేను కోరుకున్నది కాదు. ఇలా జరుగుతుందని అనుకోలేదు కూడా" వీడ్కోలు పలికేటప్పుడు దొర అన్నాడు. అతని కళ్ళ నుంచి కన్నీటి బిందువులు రాలాయి. "బ్రతుకు ఇక్కడే గడపాలని అనుకున్నాను. ఈ నేలలోనే కలిసిపోవాలని అనుకున్నాను" అతని గొంతు జీరబోయింది. "రావు గారూ, నేను వెళ్ళిపోయినా నా మనసు ఇక్కడే ఈ కర్మాగారం చుట్టూ, ఈ గోదావరీ చుట్టూ తిరుగుతూ ఉంటుంది. నేను మళ్ళీ వస్తాను. ఖచ్చితంగా తిరిగి వస్తాను"

వచ్చారు మా దొర తిరిగి వచ్చారు! గుప్పెడు బూడిదగా... కొన్ని అస్తికలుగా... అతని అస్తికలు గోదావరిలో నిమజ్జనం చెయ్యాలట! దొర కోరిక అది.

"మీరు... మీరు" ఎవ్వరో అడగడం విని ఉలిక్కిపడ్డాను. ఎదురుగా ఒక కుర్ర

పంతులు నిలబడి వున్నాడు. "మీరు హైదరాబాద్ నుంచి..."

బుర్ర ఊపాను.

"గురుగారూ, ఇతనేనట!" రోడ్డు మీద స్కూటర్ ఆపి, నిలబడి వున్న పురోహితుడికి అరిచి చెప్పాడు ఆ కుర్రపంతులు.

"ఫోనులో మాట్లాడిన వాటికి ఒప్పుకుంటున్నాడా అని అడుగు, ఓ.కే. అయితే తీసుకురా" స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయాడు పురోహితుడు. ఆ కుర్ర పంతులుతో నడిచాను. వాన తుంపరలు పడుతున్నాయి.

"కాఫీ తాగుతారా...? టిఫిను ఏమైనా..." దారిలో ఒక బండి వద్ద టిఫిను తింటూ కనబడిన పురోహితుడు అడిగాడు. ఒద్దన్నాను. చేసేపని నిష్ఠగా చెయ్యవలసిన రీతిలో చెయ్యాలనేది మాకు దొరనేర్పిన పాఠం. టిఫిను తిని, కాఫీ తాగి ఒక సిగరెట్టు వెలిగించి పొగ తాగుతూ వచ్చాడు పురోహితుడు.

"స్నానం చేసి రండి" నోటి నుంచి సిగరెట్టు తీసి పొగవదలుతూ అన్నాడు.

నేటి మనిషి ఆలోచనల్లా, నాచుపట్టిన మెట్లు దిగాను. నేటి కలుషిత మానవ హృదయాలకు ప్రతీకగా కదిలే గోదావరిలో దిగాను. నీటిపైన తేలే చెత్త చెదారం, ఆకులు, పూలు, బుట్టలు ప్లాస్టికు సంచీలు వగైరాలు వెనక్కు తీసి ముక్కు మూసుకోని మూడుసార్లు మునిగాను.

వాన తుంపరలు జోరుగా పడుతున్నాయి. గోదావరిలో మునిగిన శరీరాన్ని కొత్త తుంపరలే శుభ్రం చేస్తాయని తోచింది.

పీట మీద మఠం వేసుకోని కూర్చుని వున్నాడు పురోహితుడు. అతని ఎదురుగా అరిటాకు వేసి ఉంది. అరిటాకుపై ముడి నువ్వులు, గంధం వగైరా పక్కనే కూర్చున్నాడు కుర్ర పంతులు.

మంత్రాలు మొదలైనాయి.

"అతని గోత్రం చెప్పండి" పురోహితుడు అన్నాడు.

గోత్రమా! దొరగారి గోత్రమేమిటీ? ఏమో...

ఇంటి నుంచి బయలుదేరినప్పుడే ఈ ప్రశ్న ఎదురవుతుందని అనుకున్నాను. నా గోత్రమే అతని గోత్రంగా చెప్పాలని అనుకున్నాను కూడా కాని దొరగారి అస్తికల మీద చెయ్యివేసి అబద్ధమాడాలంటే...

కార్యసిద్ధి కోసం ఏదో ఒకటి చెప్పటం, చెయ్యటం దొరగారి పద్ధతికి విరుద్ధం... అతడు మాకు నేర్పిన నైతిక విలువలకు విరుద్ధం.

"గోత్రం చెప్పండి" మళ్ళీ అడిగాడు పురోహితుడు.

"తెలియదు".

"ఇతడు మీకేం అవుతాడు?"

నిశ్శబ్దం-

"పోనీ పేరు చెబుతారా... ఇంటిపేరు"

పేరు చెప్పాను.

"అపచారం... అపచారం..." కరెంటు తాకగానే లేచే 'స్ప్రింగ్'లా లేచాడు పురోహితుడు. "కులం గోత్రం లేనివారికి కర్మ చెయ్యవలసిన ఖర్మ నాకు పట్టలేదు. పొద్దుటే భలే బేరం దొరికిందిలే" అతడు ముందుకు సాగాడు.

"దొరగారి ఆఖరి కోరిక సార్" నేను చెప్పాను. అతడి పట్టించుకోలేదు.

దొర చేసిన తప్పేమిటి? తనకు నచ్చిన నేలలో కలిసిపోవాలని అనుకోవడం తప్పా...?

పురోహితుడు వెనక పరిగెత్తాను.

"ఇలా రండి" కుర్ర పంతులు పిలిచాడు. "నేను మంత్రం చెబుతాను. వచ్చి కూర్చోండి"

"అప్రాచ్యుడా..." పరిగెత్తుకు వచ్చి కుర్రపంతులు మీద విరుచుకుపడ్డాడు పురోహితుడు "నువ్వు ఏం చేస్తున్నావో తెలుసా..?"

"తెలుసు గురూగారు దొరని నేను చూసాను. మనతో కలిసి తిరిగిన మనిషి. అతన్ని గోత్రం పేరుతో..." అతడు మంత్రం మొదలుపెట్టాడు.

"ఏ గోత్రమని చదువుతావురా..."

"మానవ గోత్రస్య అని చదువుతాను, గురుగారూ. మీకు చెప్పదగిన వాడిని కాదు, అయినా ఒకమాట మన్నించండి. ఒక గాలిగా ఈ ప్రపంచానికి వచ్చిన మనం గాలి గానే పోతున్నాం. కులమత గోత్రాలకు ఇవ్వవలసిన దానికన్నా, ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాం. ఇలా, గోదావరిలో ఈ నేలలో కలవాలనేది దొరగారి అభిమతం. మతం అంటే అభిమతమే కదండీ...?"

నామీద గట్టిగా పడ్డాయి, వాన తుంపరలు. కలుషితమైన గోదావరిలో మునిగిన శరీరాలు శుభ్రం కావాలంటే, ఇలాంటి తుంపరలు చాలవు, జడివానే పడాలని అనిపించింది నాకు.

***